ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలి

మామిడ్గిలోని ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరుతున్న అధ్యాపకులు

న్యాల్‌కల్, మే 20: ప్రభుత్వ కళాశాల్లో చదివే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందని మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కళాశాలకు చెందిన అధ్యాపకులతో కలిసి మండలంలోని మామిడ్గి, ముంగి, ఇబ్రహీంపూర్, చినిగేపల్లి, రుక్మాపూర్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశ రుసుము లేదని, ప్రైవేటు కళాశాలలకు ధీటుగా తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తాకాలు, స్టడీ మెటీరియల్, అర్హులందరికీ ఉపకారవేతనాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. విద్యార్థుల కోసం పక్కా భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడామైదానం, ఎన్ఎస్ఎస్ సౌకర్యాలున్నాయన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు యాదగిరి, అర్జున్, జగదీశ్, నర్సింలు, బాల్‌రాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

మేళ్ల చెరువు పరిసరాల్లో చెత్తను తొలిగిస్తున్న కమిషనర్ సంగారెడ్డి, టీనా సభ్యులు

రామచంద్రాపురం, మే 20: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, టీనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిసరాల శుభ్రత కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి, గేటెడ్ కమ్యూనిటీ వాసులు పాల్గొని తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలిగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ సిబ్బందిని ఎప్పటికప్పుడు పారిశుధ్యం విషయంలో అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. అనంతరం టీనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా టీనా ఆధ్వర్యంలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

తాగునీటిపై కదిలిన యంత్రాంగం

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- ఇస్నాపూర్ సంపు వద్ద నీటి శాంపిల్స్ సేకరణ
- తనిఖీకి ఆదేశాలిచ్చిన మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్
- సంప్‌ను పరిశీలించిన మిషన్ భగీరథ ఈఈ పాషా
- తాగునీటి కోటా పెంచేందుకు ప్రతిపాదనలు

ఇస్నాపూర్ సంప్ వద్ద నీటి శాంపిల్స్ సేకరిస్తున్న ఈఈ పాషా, డీఈ శ్రీనివాస్, తదితరులు

పటాన్‌చెరు, మే 20: 'జలం.. గరళం.. ప్రజల ప్రాణాలతో చలగాటం' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ జిల్లా ఎస్ఈ రఘువీర్ స్పందించారు. తాగునీటిలో కలుషిత జలాలు మిక్స్ చేస్తున్నారని, జనాభాకు సరిపోను నీరు అందించడం లేదని నమస్తే తెలంగాణ వెలుగులోకి తీసుకొచ్చింది. కథనంపై స్పందించిన ఎస్ఈ ఈఈ పాషాను, కెమిస్ట్ నాగేందర్ బృందాన్ని ఇస్నాపూర్ సంప్ వద్దకు పంపించారు. వారు నీటి శాంపిల్స్‌ను సేకరించారు. పంచాయతీ లైన్‌మెన్‌లతో నీటి సరఫరా విధానంపై ప్రశ్నించి సమాధానాలు రికార్డు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈఈ పాషా మాట్లాడుతూ ఎస్ఈ ఆదేశాల మేరకు ఇస్నాపూర్ పంచాయతీలో పంపిణీ చేస్తున్న మూడు బోర్ల నుంచి నీటి శాంపిల్స్ సేకరించినట్లు తెలిపారు. మిషన్ భగీరథ నీటిని, సంప్‌లో మిక్స్ అవుతున్న నీటి సాంపిల్స్‌ను సేకరించినట్లు చెప్పారు. నీటిలో కలుషితాలుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఇస్నాపూర్ గ్రామానికి 2011 జనాభా లెక్కల ప్రకారం నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. అప్పటి జనాభా 8,276 ఉండగా ప్రస్తుతం 30 వేల పైచిలుకు ఉన్నారని, ప్రతి ఏడాది 0.8 శాతం రూరల్‌లో, 2 శాతం అర్బన్‌లో జనాభా పెరుగుదలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. పాత జనాభా లెక్కల ప్రకారం పెరుగుతున్న జనాభాకు సరిపోను నీరు అందడం లేదని ఒప్పుకున్నారు. నగరానికి దగ్గరగా ఉండటంతో కొత్త కాలనీలు శరవేగంగా ఏర్పాటవుతున్నాయని, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలున్నా, కొత్త జనాభా లెక్కలు లేకపోవడంతో అందరికీ నీరందించడం సమస్యగా మారిందన్నారు. పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్, ఇంద్రేశం, ముత్తంగి, చిట్కుల్, పోచారం గ్రామాల్లో పరిస్థితి ప్రత్యేకమైనదిగా గుర్తించి రూ.25 కోట్లతో కొత్త పైప్‌లైన్ నిర్మించేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇంద్రేశం వరకు సరిపోను తాగునీరు వస్తున్నదన్నారు. సంపుల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేస్తామని, ల్యాబ్‌లో బ్యాక్టిరియా, కాలుష్య కారకాలు ఏమైనా ఉన్నాయా అనేది పరీక్షిస్తామన్నారు. తాత్కాలికంగా ఇస్నాపూర్, ముత్తంగి వంటి గ్రామాలకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎక్కువ నీరందిస్తామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను గౌరవిస్తామన్నారు. కాలుష్య సమస్య పారిశ్రామిక గ్రామాల్లో ఉందని గుర్తించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, జేఈ శ్రీనివాస్, కెమిస్ట్ నాగేందర్, ల్యాబ్ అసిస్టెంట్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జనుము విత్తనాల బస్తాలను పంపిణీ చేస్తున్న ఏవో లావణ్య

సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ

న్యాల్‌కల్, మే 20: రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని మండల వ్యవసాయాధికారి లావణ్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని సహకార సంఘంలో ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన జనుము విత్తనాల బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలాల్లో జనుము(పచ్చిరొట్ట) పంటను సాగు చేసుకోవడం వల్ల పొలానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఫలితంగా దిగుబడి పెరిగి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో సాయిలు, షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు వినియోగించుకోవాలి

కోహీర్, మే 20: సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ డివిజన్ వ్యవసాయాధికారి భిక్షపతి కోరారు. జహీరాబాద్ డీసీఎంఎస్ కార్యాలయంలో జనుము, జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందజేస్తామన్నారు. క్వింటా విత్తనాలకు రూ.9,050 ఉండగా రూ.5,400 సబ్సిడీ లభిస్తుందన్నారు. విత్తనాలు అవసరమయ్యే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, ఫోన్ నంబర్‌తో సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని కోరారు. భూమిలో తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

అందోల్, మే 20: రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి విజయరత్న సోమవారం ప్రకటనలో తెలిపారు. 30 కేజీల జీలుగ విత్తనాలు సబ్సిడీ పోను రూ.1,116, 40 కేజీల జనుము విత్తనాలు రూ.1,448కి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు అవసరమున్న రైతులు జోగిపేటలోని రైతుసేవా కేంద్రంలో సంప్రదించి తీసుకువెళ్లాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీరప్ప కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కనులపండువగా బీరప్ప కల్యాణం

సదాశివపేట, మే 20: కురుమ సంఘం ఆధ్వర్యంలో సదాశివపేటలో బీరప్ప జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా సోమవారం బీరప్పస్వామి కామరతి కల్యాణ తంతు వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరప్పస్వామి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బోనాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఒగ్గు కళాకారులు బీరప్ప కథ బాగోతం ఆడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, నాయకులు కొత్తగొల్ల కృష్ణ, కొత్తగొల్ల సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సికింద్లాపూర్ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, మే 20: మండలంలోని సికింద్లాపూర్‌లో సోమవారం జరిగిన బీరప్ప జాతరలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నిర్వహించిన బీరప్ప కామరతి కల్యాణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జాతరలు జరుపుకోవడంతో భక్తిభావం పెంపొందుతుందన్నారు. జాతర్లు, ఉత్సవాలు, బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, నర్సింహారెడ్డి, మాణిక్యరెడ్డి, యాదగిరి, ఎల్చాల మధు, వీరేశం గౌడ్, వీరేందర్, శ్రీకాంత్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఓ వైపు ఆక్రమణ.. మరో వైపు మట్టి దందా

న్యాల్‌కల్, మే 20: ఓ వైపు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. మరో వైపు చెరువులు, కుంటల నుంచి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని రాజోలా గ్రామంలోని సర్వే నంబర్ 101 ప్రభుత్వ భూమిని కొందరూ ఆక్రమించుకున్నారు. కొంతకాలంగా ఈ భూమి ఖాళీగా ఉండడంతో కొందరు పెంటకుప్పలు వేసుకున్నారు. కబ్జాదారులు ఆ పెంట కుప్పలను తొలిగించారు. ఆ పక్కనే ఉన్న పట్టాదారుల కడీలను సైతం తొలిగించి భూమిని చదును చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండని బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

రాజోలాలో ప్రభుత్వ భూమిలో మొరం పోసి చదును చేసిన దృశ్యం

హద్నూర్ పెద్ద చెరువు ప్రాజెక్టులో జేసీబీతో టిప్పర్‌లో మట్టిని తరలిస్తున్న దృశ్యం

అనుమతి లేకుండా మట్టి తరలింపు

మండలంలోని హద్నూర్ పెద్ద చెరువు ప్రాజెక్టు, ప్రభుత్వ భూముల్లో సంబంధిత అధికారుల అనుమతి లేకుండా అక్రమార్కులు యథేచ్ఛగా జేసీబీతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా పొలాలకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ భూపాల్‌ను వివరణ కోర గా ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వ భూ ములను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని, అనుమతి లేకుండా ఎవరు మట్టి తరలించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

కోహీర్, మే 20: రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ పట్టణ సీఐ రాజబోయిన రవి కోరారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో లైసెన్స్, వాహన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, నంబర్ ప్లేట్ లేని బైక్‌లను నడిపించొద్దన్నారు. అలాంటి బైక్‌లు రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాన్ని నిలుపరాదని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. బుల్లెట్ బైక్ ఉన్న వారు హైసౌండ్ కలిగిన సైలెన్సర్లను వాడొద్దన్నారు. షాపింగ్ మాల్స్, మార్టుల వద్ద క్రమ పద్ధతిలో వాహనాలను నిలుపాలని కోరారు. జహీరాబాద్ పరిధిలోని దాబాలు, హోటళ్లు, ఎట్టి పరిస్థితిల్లోనూ రాత్రి 11.30లోగా మూసివేయాలన్నారు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100కు డయల్ చేయాలని కోరారు.

ప్రభుత్వ పథకాలతో కార్మికులకు లబ్ధి

సంగారెడ్డి, మే 20: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రమేశ్ కోరారు. సోమవారం పట్టణంలోని భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యాలయంలో అసంఘటిత రంగ కార్మికులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డులను తప్పక తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందే విషయంలో ఏరకం గానైనా అన్యాయానికి గురైతే ఉచిత న్యాయ సహాయానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సదస్సులో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రవీందర్‌రెడ్డి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యాదయ్య, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రమేశ్

ఘనంగా పోచమ్మ బోనాలు

పుల్కల్, మే 20: పోచమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా పుల్కల్‌లో రెండో రోజు బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. శివసత్తుల విన్యాసాలు, నృత్యాలు, కోలాటాల నడుమ బోనాల ఊరేగింపు కనులపండువగా సాగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, పీఏసీఎస్ డైరెక్టర్ మహేశ్ బాబు, ఆలయ కమిటీ సభ్యులు మన్నె నర్సింహులు, వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మఠం సిద్దయ్య, మాజీ ఉప సర్పంచ్‌లు కళ్లపల్లి నర్సింహులు, మన్నె విఠల్, వెంకటేశం, పెంటయ్య, మన్నె శేఖర్, బోయిని శ్రీనివాస్, పవన్, శ్రీనివాస్, వెంకటేశం పాల్గొన్నారు.

బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వ్యక్తి ఆత్మహత్య

కల్హేర్, మే 20: కుటుంబ కలహాలు, అనారోగ్యంతో బాధ పడలేక ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగ్‌దర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేట్ మండలం నాగదర్ గ్రామానికి చెందిన పన్నెల అశోక్ (25) కొంతకాలంగా అనారోగ్యం, కుటుంబ కలహాలతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులందరూ కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోగా భార్య, తల్లి ఇద్దరూ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. తర్వాత నారాయణఖేడ్‌లోని సర్కార్ దవాఖానకు తరలించగా సంగారెడ్డికి రెఫర్ చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి బీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రైవర్లకు అండగా బీఆర్టీయూ

బొల్లారం, మే 20: ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలో కొన్నేండ్లుగా రెడీమిక్స్ వాహన డ్రైవర్లుగా క్లీఫ్ అన్సారీ, ఇర్ఫాన్ అన్సారీలు పని చేస్తున్నారు. కొన్ని అనివార్య కారణాలతో వారిద్దరు పని మానేశారు. దీంతో వారికి రావాల్సిన వేతనాన్ని సదరు యజమానుల వద్ద నుంచి అందించేలా న్యాయం చేయాలని బీఆర్టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్‌ను కలిసి విన్నవించారు. రవిసింగ్ రెడీమిక్స్ యజమానులు నవీన్ రెడ్డి, భరత్‌లతో చర్చించి డ్రైవర్లు ఇద్దరికీ రూ.35 వేల చొప్పున రావాల్సిన రూ.70 వేల వేతనాన్ని సోమవారం అందించారు. కార్యక్రమంలో స్థానికులు అనిల్, సుదర్శన్, జగన్, ప్రేమ్ పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

పంటల ప్రణాళికపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చిన్నకోడూరు, మే 20: రైతులు మొక్క ఎదుగుదలను బట్టి ఎరువులు వేయాలని మధ్య తెలంగాణ మండల సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. సోమవారం ఏరువాక కేంద్రం, తోర్నాల, చిన్నకోడూరు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతువేదికలో వానకాలం పంటల ప్రణాళికపై అవగాహన కల్పించారు. వరిలో వెదజల్లే పద్ధతిలో ఎదురయ్యే సమస్యలను నివృత్తి చేశారు. పలువురు రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు. అనంతరం శాస్త్రవేత్త డాక్టర్ వి.సునీత అడవి పందులు, కోతుల నుంచి పంటలను ఎలా రక్షించుకోవాలో వివరించారు. ప్రపంచ తేనెటీగల దినోత్సవాన్ని పురస్కరించుకొని తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పించారు.

టేకుల కుంట కట్ట ధ్వంసం

జిన్నారం, మే 20: జిన్నారం మండలం ఊట్ల గ్రామ పరిధిలోని టేకులకుంటను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. ఉపాధి హామీ పనుల ద్వారా ఇటీవల వేసిన కట్టను జేసీబీలతో తొలిగించి చదును చేశారు. ఉపాధి హామీ పనుల ద్వారా నాలుగు నెలల పాటు కట్టను పునరుద్ధరించారు. పనులు పూర్తయి సుమారు రెండు నెలలు కావస్తున్నది. కాగా కొందరు ప్రైవేటు వ్యక్తులు కట్టను చెరువును ధ్వంసం చేసి చదును చేశారు. ఉపాధి పనుల కోసం తవ్విన గుంతలను పూడ్చిచేశారు. ఉపాధి పనుల ద్వారా వేసిన కట్ట పనులు ఇంకా రికార్డు కాలేదని ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ తెలిపారు. కట్టను ధ్వంసం చేయడంతో ఊట్ల గ్రామ మత్స్య సహకార సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కట్టను చదును చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. కట్టను ధ్వంసం చేసిన వారిపై ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కట్టను తొలిగిస్తున్న జేసీబీ

కట్టిపడేస్తున్న రాయసముద్రం అందాలు

అహ్లాదకరంగా కన్పిస్తున్న రాయసముద్రం చెరువు

రాయసముద్రం చెరువులో సేదతీరుతున్న వివిధ రకాల పక్షులు

- పుష్కలంగా నీరు.. పక్షుల కిలకిలరావాలు
- ఆహ్లాదాన్ని పంచుతున్న చెరువు పరిసరాలు

రామచంద్రాపురం, మే 20: ఆర్సీపురం పట్టణానికి వరప్రదాయిని రాయసముద్రం చెరువు. చుట్టూరా నిర్మాణాలు మధ్యలో చెరువు ఉండడంతో మినీ ట్యాంక్‌బండ్‌గా కనువిందు చేస్తున్నది. పట్టణ వాసులకు పక్షుల కిలకిలరావాలతో గ్రామీణ వాతావరణాన్ని అందిస్తున్నది. ఉదయం లేచినప్పటి నుంచి తిరిగి సాయంత్రం వరకు రాయసముద్రం చెరువు వద్ద వివిధ రకాల పక్షులు తిరుగుతూ స్థానికులను కనువిందు చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనే కనిపించే ఇలాంటి వాతావరణం రాయసముద్రం రూపంలో పట్టణ వాసులకు లభించడం అదృష్టంగా భావిస్తున్నారు. మార్నింగ్ వాకర్స్‌కి పక్షుల కిలకిలారావాలు మనస్సుకు ఎంతో ఉల్లాసాన్ని, ప్రశాంతతను కల్పిస్తున్నాయి. చెరువులో నిండుగా నీరు ఉండడంతో పక్షులకు కావాల్సిన ఆహారం అందుతుండడంతో రకరకాల పక్షులు రాయసముద్రం వద్దకు వచ్చి సేదతీరుతున్నాయి. వాటిని చూసేందుకు పెద్దలతో పాటు చిన్నారులు చెరువు వద్దకు వస్తున్నారు.

వందెకరాల్లో చెరువు

సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో రాయసముద్రం చెరువు విశాలంగా ఉంటుంది. చెరువు చుట్టూ పచ్చదనం పర్చుకోవడంతో పశువులకు మేత దొరుకుతుంది. చెరువులో నీరు ఉండడంతో మత్స్యకారులకు ఉపాధిని లభిస్తున్నది. పట్టణం నడిబొడ్డులో ఉన్న రాయసముద్రం పట్టణ ప్రజలకు ఒక వరంగా మారింది. చెరువు కారణంగా చెరువు కింది ప్రాంతం, పై ప్రాంతంలో భూగర్భజలాలు మెరుగ్గా ఉంటున్నాయి. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ తరహాలో రాయసముద్రం ఉంటుందని స్థానికులు చెబుతుంటారు.

పెండింగ్‌లో అభివృద్ధి పనులు

రాయసముద్రం చెరువుని మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తే బాగుంటుందని పట్టణ వాసులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చెరువు అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు అయ్యాయి. అప్పుడు చెరువు అభివృద్ధిలో భాగంగా కొంత మేరకు పనులు జరిగినా.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది. చెరువు అభివృద్ధిలో భాగంగా చుట్టూరా వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ, లైటింగ్, పిల్లల కోసం పార్కు, సిట్టింగ్ టేబుల్స్, గుర్రపుడెక్క తొలగింపు ఇలా తదితర పనులు చేయాల్సి ఉన్నప్పటికీ గుర్రపుడెక్క తొలిగింపు, పూడికతీత, వాకింగ్ ట్రాక్, చెరువు కట్ట పునరుద్ధరణ పనులు కొంతమేరకు మాత్రమే జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్ చెరువుపై దృష్టి పెట్టి మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయడంతోపాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.